క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో ఓట్లు పరిశీలించాలి



పటమట(విజయవాడతూర్పు): ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుపై బీఎల్‌వోలు (బూత్‌లెవల్ అధికారి) పూర్తి అవగాహనతో పనిచేయాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు మెంబర్స్ సెక్రటరీ, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ పరిశీలకులు బి.శ్రీధర్ అన్నారు. గురువారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో సెంట్రల్ నియోజకవర్గ బీఎల్‌వోలతో బిషప్ అజరయ్య పాఠశాల్లో సమీక్ష నిర్వహించారు. ఓటు నమోదులో క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని, తొలగింపులో ఫారం 7ను పరిశీలన చేయాలని, ఓట్ల తొలగింపులో రాజకీయ పార్టీల అభ్యంతరాలను తప్పకుండా పరిశీలించాలని సూచించారు.

మలబార్‌లో మైన్ డైమండ్‌షో



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మా గాంధీరోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్‌లో మైన్ డైమండ్ షో గురువారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ఆ షోరూమ్ కస్టమర్స్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 19 వరకూ నిర్వహించే ఈ డైమండ్ షోలో విభిన్న రకాల డైమండ్ నెక్లెస్‌లు, వెడ్డింగ్ కలెక్షన్స్, లైట్ వెయిట్ హారాలు అందుబాటులో ఉంటాయని షోరూమ్ మేనేజర్ సిద్ధిక్ తెలిపారు. అదే విధంగా డైమండ్ నగలు కొనుగోలుపై పలు రాయితీలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

పౌష్టికాహారం అధికంగా తీసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థినిలు పౌష్టికాహారం ఆకు కూరలు అధికంగా తీసుకోవాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ కోలా విజయశేఖర్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ విజయవాడ ఆధ్వర్యాన రక్తహీనతపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిల్లో రక్తహీనత సమస్యలు అధికంగా ఉంటున్నాయన్నారు. మహిళలు సాధ్యమైనంత ఎక్కువగా ఐరన్ ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బేబీరాణికి అభినందనలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీకి చెందిన వేముల బేబీరాణి ఎంపికయ్యారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన బేబీరాణి ఏపీ బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా, హైకోర్టు న్యాయవాదిగా విశిష్ట సేవలను అందిస్తున్నారు. ఆమె చేస్తున్న కృషిని గుర్తించి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆమెను నియమించింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు సహకరిస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీతక్కకు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు, తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవినేని అవినాష్‌కు, డాక్టర్ మారేశ్‌కు బేబీరాణి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు బీసీ, మహిళా సంఘాల నాయకులు సింగ్‌నగర్‌లోని ఆమె స్వగృహంలో సత్కరించి అభినందనలు తెలిపారు.

బీమా అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్ ప్రాంతానికి చెందిన సక్కిం విజయశంకర్(36) లివర్ డ్యామేజీతో మంగళవారం మరణించాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తాత్కాలిక సాయం రూ. 10 వేలను వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి యరగొర్ల శ్రీరాములు గురువారం అందజేశారు. వెల్ఫేర్ సెక్రటరీ బ్రహ్మానందం, వాలంటీర్లు గణేష్‌కుమార్, ప్రసాద్, శ్రీను, జోషికుమార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గొళ్ళమూడి శేఖర్ బాబు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను స్క్రీన్ ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో నవజీవన్ జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక, జాకబ్‌రాజు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి తదితరులు మాట్లాడారు.

జగనన్న పాలనలో పేదల చెంతకే సంక్షేమం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు పేదలను వెతుక్కుంటూ వారి గుమ్మం వద్దకే వస్తున్నాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 60వ డివిజన్ 263, 265, 266, 267వ వార్డు సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి.. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారికి, ఖరీదైన కార్లలో తిరిగే వారికి పథకాలు మంజూరు చేసే వారని.. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత శాచ్యురేషన్ పద్ధతిలో పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి చెప్పిన తేదీకే లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. 263వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ మరియు నాన్ డీబీటీ ద్వారా అక్షరాలా రూ. 21.70 కోట్ల మేలు చేకూర్చగా.. 265వ వార్డు సచివాలయ పరిధిలో రూ. 14.81 కోట్లు., 266వ వార్డు సచివాలయ పరిధిలో రూ. 12.62 కోట్లు., 267వ వార్డు సచివాలయ పరిధిలో రూ. 15.62 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. చంద్రబాబుకు ఎన్నికల ముందు మాత్రమే సంక్షేమ పథకాలు గుర్తుకొస్తాయని కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వరుసగా నాలుగున్నరేళ్లు నిర్విరామంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. సాంకేతిక, మరే ఇతర కారణాలతో మిగిలిపోయిన ఒక్క శాతం మందిని కూడా జల్లెడ పట్టి మరీ.. ఏటా రెండు పర్యాయాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రిగా మరోమారు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



60వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



32వ డివిజన్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

32వ డివిజన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్ 232వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జీ గుండె సుందర్‌పాల్‌తో కలిసి గురువారం పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేసి, మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. 232వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా 10 కోట్ల 61 లక్షల 33 వేల 890 రూపాయల మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా 7 కోట్ల 45 లక్షల ఒక వేయి 820 రూపాయలు లబ్ధి చేకూర్చినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో 40 ఏళ్ల ప్రగతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాలుగున్నరేళ్లలో సెంట్రల్ నియోజకవర్గం 40 ఏళ్ల ప్రగతిని సాధించిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ 251వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి గురువారం ఆయన పాల్గొన్నారు. దేవీనగర్‌లో గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన 30వ డివిజన్‌లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. 251వ వార్డు సచివాలయం పరిధిలో ఇప్పటి వరకు రూ. 4.40 కోట్ల సంక్షేమాన్ని అందజేసినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. కనుకనే సీఎం జగన్‌కి ప్రజల్లో వస్తోన్న విశేష ఆదరణ అది చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ఈర్ష్య, ద్వేషాలతో రగిలిపోతున్నారని విమర్శించారు.

పవన్, చంద్రబాబు అట్టర్ ఫ్లాప్ కాంబినేషన్: పవన్‌కళ్యాణ్, చంద్రబాబులది అట్టర్ ఫ్లాప్ కాంబినేషన్ అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. 2014–19 మధ్య ఇచ్చిన మేనిఫెస్టో ఎక్కడుందో టీడీపీ–జనసేన నాయకులకు కూడా తెలియదని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల్లో 99.50 శాతం నెరవేర్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని చెప్పుకొచ్చారు. కనుకనే కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జగనన్నే మరలా ముఖ్యమంత్రి కావాలని బలంగా కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అది చూసి ఓర్వలేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ముప్పేట దాడి చేస్తున్నాయని ఎమ్మెల్యే విష్ణు మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మార్తి చంద్రమౌళి, పవన్‌కుమార్‌రెడ్డి, తుంపాల వరప్రసాద్, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, వి.రమేష్, డి.దుర్గారావు, సామంతకూరి దుర్గారావు, ఎస్.రామకృష్ణ, మోహన్, భాషా, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

నాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బండి పుణ్యశీల

విజయవాడ కల్చరల్: నాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఏపీఐఐసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల అన్నారు. రంగస్థల ప్రముఖుడు గుమ్మడి జయరాజ్ కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద గురువారం జయరాజ్ 11 వ సంస్మరణ సభ, పద్యనాటక ప్రదర్శన, రంగస్థల నటుడు కె. పరబ్రహ్మాచారికి ఆత్మీయ సత్కారం, జయరాజ్ కళాపీఠం వార్షికోత్సవ సాంస్కృతిక మహోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ నిర్వహించారు. పుణ్యశీల మాట్లాడుతూ రంగస్థల కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. డెప్యూటీ మేయర్ బెల్లందుర్గ మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున రాష్ట్ర స్థాయిలో నాటిక పోటీలు నిర్వహించి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా వైఎస్సార్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయకుమార్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా జయరాజ్ కళాపీఠం ఆధ్వర్యంలో నాటక రంగంలోని వివిధ రంగాలకు చెందిన వారిని గుర్తించి వారికి పురస్కారాలను అందజేస్తునట్లు పేర్కొన్నారు. జయరాజ్ కళాపీఠం నిర్వాహకుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి గుమ్మడి జయరాజ్ విశిష్టమైన సేవలను అందించినట్లు కొనియాడారు. ఎంతోమంది యువ నటులకు శిక్షణ నిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట బాలజీ నాయుడు, చింతలపూడి నాగేశ్వరరావు, ఏసుపాదంతోపాటు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్‌ను పుణ్యశీల, బెల్లం దుర్గ ఆవిష్కరించారు. రంగస్థలానికి చెందిన పరబ్రహ్మాచారిని నిర్వాహకులు సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా చింతామణి, సత్యహరిశ్చంద్ర పద్యనాటకంలోని ప్రధాన సన్నివేశాలు ప్రదర్శించారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పుణ్యశీల, బెల్లం దుర్గ, విజయకుమార్, జీవన్‌కుమార్ తదితరులు

సగరుల అభ్యున్నతికి కృషి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సగర కులానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని, సగర సంఘీయుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సీతన్నపేటలోని వీఎంసీ కళ్యాణ మండపంలో సగర భగీరథ సంఘీయుల ఆత్మీయ సమావేశం గురువారం జరిగంది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సమాజంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ముఖ్యంగా సగరులకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మక దుర్గమ్మ తల్లి ఆలయ ఛైర్మన్‌గా సగరులను నియమించడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఏపీ సగర రాజ్‌పుత్ సేవా సమితి సభ్యుడు మద్రబోయిన వెంకట్రామయ్య, కగ్గా పాండురంగారావు, ధనికొండ వెంకటేశ్వరరావు, జలసూత్రం నాగరాజు, రాణిమొకల సతీష్, ధనికొండ ఆంజనేయులు, జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ స్పోర్ట్స్: జిల్లాలో నేరాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఏసీపీలు, సీఐలకు డీసీపీ విశాల్ గున్ని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ సమీక్షా సమావేశాన్ని ఈ నెల 13వ తేదీన జగ్గయ్యపేటలో డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందితో డీసీపీ విశాల్‌గున్ని విజయవాడలోని పోలీస్ కమిషనరేట్‌లో గురువారం చర్చించారు. ప్రతి ఒక్కరూ విధుల్లో మెరుగైన పనితీరు కనబర్చాలని, క్రమం తప్పకుండా ఫుట్ పెట్రోలింగ్, పెట్రోలింగ్, బీట్స్ సంఖ్యను పెంచి అనుమానితులపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పలు కేసుల్లో పట్టుబడిన నిందితులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, నేరాలకు పాల్పడటం వల్ల కలిగే నష్టాలపై నిందితులకు సవివరంగా చెప్పాలని కోరారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని కోరారు. గంజాయి కేసుల్లో నిర్దేశిత సమయానికి చార్జ్‌షీట్ వేయాలని ఆదేశించారు. మహిళా సంబంధిత కేసులను అలసత్వం చేయకుండా వెంటనే దర్యాప్తు చేయాలని, మహిళలపై ఈవ్ టీజింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టేషన్‌కు తీసుకొచ్చే నిందితులతో జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ బ్లాక్ స్పాట్‌లను గుర్తిస్తూ తగు చర్యలు తీసుకుని రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని తెలిపారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి సేవించే, విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెంచాలని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీలు డాక్టర్ కె.హనుమంతరావు, డాక్టర్ బి.రవికిరణ్, సీఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ విశాల్‌గున్ని

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 30వ డివిజన్ దేవీనగర్‌లో స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి 'ఆడుదాం ఆంధ్రా' కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ–వార్డు సచివాలయ స్థాయి నుంచి ఐదు దశల్లో పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలుత గ్రామ–వార్డు సచివాలయాల స్థాయిలో పోటీలు జరుగుతాయని ఇక్కడ విజేతలను మండలస్థాయి పోటీలకు, అక్కడ గెలిచిన వారిని నియోజకవర్గ స్థాయి, తర్వాత జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ప్రతి దశలోనూ విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు పురస్కారాలు ఉంటాయని వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రభుత్వం ఉచితంగా క్రీడా సామాగ్రిని సైతం అందజేస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. రాష్ట్రస్థాయి విజేతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్తి చంద్రమౌళి, తుంపాల వరప్రసాద్, పవన్ కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, వి.రమేష్, డి.దుర్గారావు, సామంతకూరి దుర్గారావు, ఎస్.రామకృష్ణ, మోహన్, బాషా, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



'ఆడుదాం ఆంధ్రా' కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

స్కూల్ బస్సులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భద్రతా ప్రమాణాలు పాటించకుండా స్కూల్ బస్సులను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ ఎం.పురేంద్ర పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడే విధంగా స్కూల్ బస్సులను నడిపితే ఊరుకునేది లేదని, అటువంటి వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని డీటీసీ పేర్కొన్నారు. రోడ్డు టాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు కట్టకుండా ఫిట్‌నెస్, రూట్ పర్మిట్లు తీసుకోకుండా బస్సులు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు చేయగా సరైన రికార్డులు, రోడ్డు టాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా, 51 మంది విద్యార్థులను తీసుకువెళ్లాల్సిన బస్సులో 79 మందిని ఎక్కించారని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు లేని వ్యక్తితో బస్సు నడపడాన్ని గమనించి బస్సు సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ విషయంపై సంబంధిత స్కూల్ యాజమాన్యానికి నోటీసులు కూడా జారీ చేశామని వెల్లడించారు. పాఠశాలల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బాధ్యతగా వాహనాలు నడపాలని డీటీసీ పురేంద్ర సూచించారు.

గోసంరక్షణ సంఘానికి నాలుగెకరాలు అప్పగింత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలోని శ్రీవిజయ గోసంరక్షణ స్థల సమస్యను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పరిష్కరించారు. 22ఏ జాబితా నుంచి తొలగించి నాలుగెకరాల భూమిని గోశాలకు అప్పగించారు. గోశాలకు భూమిని అప్పగించడం పట్ల శ్రీవిజయ గోరక్షణ సంఘం సభ్యులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శ్రీవిజయ గోసంరక్షణ సంఘం కార్యదర్శి గోవింద కుమార్‌సాభు, కార్యవర్గ సభ్యుడు అడుసుమిల్లి కృష్ణప్రసాద్ కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేలాది గోవులను సంరక్షిస్తూ హిందూ ధర్మ పరిరక్షణలో పాలుపంచుకుంటున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. గోసంరక్షణ అనేది అనాదిగా వస్తున్న ఆచారమని గోశాల లేని ప్రదేశమంటూ ఎక్కడా లేదన్నారు. అప్పగించిన స్థలంలో గోసంరక్షణకు అవసరమైన పనులను చేపట్టడంలో తనవంతు సహకారం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విజయ గోసంరక్షణ సంఘం కార్యదర్శి సాభు మాట్లాడుతూ 1927లో ప్రారంభమైన గోశాలలో నేడు 1800 గోవులను సంరక్షిస్తున్నామని చెప్పారు. గతంలో గోశాలకు గొల్లపూడిలో భూమిని కేటాయించడం జరిగిందన్నారు. గొల్లపూడిలో ఉన్న స్థలాన్ని 22ఏ నుంచి తొలగించి తిరిగి గోశాలకు అప్పగించాలని కోరిన వెంటనే కలెక్టర్ స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీవిజయ గోసంరక్షణ సంఘం ప్రెసిడెంట్ గోపిశెట్టి మల్లయ్య, కార్యవర్గ సభ్యులు విఠల్‌ప్రసాద్ లోయా, సురేష్‌కుమార్ సోలంకి, తూనుగుంట్ల శ్రీనివాస్, పీయూష్‌దేశాయ్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న గోసంరక్షణ సంఘం సభ్యులు

మాకినేని బసవపున్నయ్యకు నివాళి

కృష్ణలంక(విజయవాడతూర్పు): దళితులు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడిన గొప్ప వ్యక్తి మాకినేని బసవపున్నయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్రసమరయోధుడు, మార్క్సిస్టు మేథావి మాకినేని బసవపున్నయ్య 109వ జయంతి సందర్భంగా గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కేంద్రం ఇన్‌చార్జి బి.ఆర్.తులసీరావు అధ్యక్షత గురువారం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బసవపున్నయ్య స్వాతంత్రోద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన దిశగా సమాజంలోని అణగారిన ప్రజలకు సేవ, అభ్యున్నతి, సాంస్కృతిక వికాసం కోసం ఎం.బి.విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని చెప్పారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఛైర్మన్ పి.మధు మాట్లాడుతూ బసవపున్నయ్య స్వాతంత్రోద్యమ కాలం నుంచే బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. బసవపున్నయ్య ఆశయ బాటలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళలు, బడుగు బలహీన వర్గాల కోసం కుట్టుశిక్షణ, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ లాంటి అనేక శిక్షణల ద్వారా వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సీఐటీయూ ప్రధానకార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.మురళీకృష్ణ, వి.రామరాజు, టి.క్రాంతికిరణ్, స్వరూపరాణి, గుండు నారాయణ, ఎస్.పి.రామరాజు పాల్గొన్నారు.



బసవపున్నయ్య జయంతి సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ముగిసిన అయ్యప్ప స్వాముల అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న అయ్యప్పస్వాముల అన్నప్రసాద వితరణ గురువారం ముగిసింది. చివరి రోజు సందర్భంగా స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు అయ్యప్పస్వాములకు భోజనాలు ఏర్పాటు చేసిన మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీరమోహనరావును అభినందించారు.

తాము మందిరంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణకు సహకరించిన భక్తులు, దాతలకు మోహనరావు కృతజ్ఞతలు తెలియజేశారు. సుమారు 500 మంది భక్తులు, అయ్యప్పలు స్వామివారి ప్రసాదంను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సైనికోద్యోగుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఏపీ రాష్ట్ర మాజీ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మోటూరి శంకరరావు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఏపీ మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం గురువారం జరిగింది. శంకరరావు మాట్లాడుతూ మాజీ సైనికులకు సంక్షేమ ఫలాలు అందడంలేదని ఎక్స్ సర్వీస్‌మెన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమం అమలు చేయాలని పేర్కొన్నారు. మాజీ సైనికులకు టిడ్కో తరహా ఇళ్లు కట్టించాలని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో తాండ్ర సాంబశివరావు, పి.లక్ష్మీనారాయణ, బి.సీతాదేవి, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వివాహిత మహిళ అనుమానస్పదంగా మృతిచెందిన ఘటన గురువారం రాత్రి కేదారేశ్వరపేటలో చోటుచేసుకుంది. సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేదారేశ్వరపేటకు చెందిన అనిల్, బి.మాధవి జ్యోతి(28)లకు మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆది నుంచి వీరిద్దరి మధ్య తరచూ మనస్పర్థలు వస్తున్నాయి. గురువారం కూడా ఇదే విధంగా గొడవ జరిగింది. అనిల్ తన పనుల నిమిత్తం బయటకు వెళ్లగా మాధవి జ్యోతి ఇంట్లో తలుపేసుకొని ఉండిపోయింది. సాయంత్రం అయినా మాధవిజ్యోతి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు తలుపులు తీసి చూడగా ఆమె ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకొని కనిపించింది. విషయాన్ని వారు భర్త అనిల్‌కు తెలుపగా అతను 100కు ఫోను చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సింగ్‌నగర్ సీఐ గురుప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం స్థలం స్వాధీనం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం అబ్బూరివారివీధిలో కబ్జాకు గురైన విశ్వబ్రాహ్మణ సంఘం నిర్వహణలోని దేవాదాయ శాఖకు చెందిన స్థలం న్యాయస్థానం ఆదేశాలతో తిరిగి సంఘానికి దక్కింది. ఈ సందర్భంగా జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం చైర్మన్ తోలేటి శ్రీకాంత్, అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తిలకు స్వాధీన పత్రాలను అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం నిర్వాహణలో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు సంబంధించి 367 గజాల స్థలం కొంతకాలంగా ఇతరులు ఆక్రమణ చేయడంతో సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఇటీవల న్యాయస్థానం నుంచి తమకు అనుకూలంగా తీర్పు రావడంతో గురువారం దేవాదాయ శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించి విశ్వబ్రాహ్మణ సంఘానికి స్వాధీన పత్రాలను అందజేశారు. తమ న్యాయ పోరాటంలో సహకరించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవాదాయ శాఖ అధికారులకు ఈ సందర్భంగా శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, కుప్పిలి సత్యనారాయణ, జవ్వాది సుధీర్, పాలడుగు శివ, చేబ్రోలు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు దీవెనలతో మళ్లీ సీఎంగా జగనన్న గెలవాలి



పాయకాపురం(విజయవాడరూరల్): క్రీస్తు దీవెనలతో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాంబే కాలనీలో బిలీవర్స్ చర్చి నందు సంఘ కాపరస్థులు ఆశీర్వాదం ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసిన తోట శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వ మానవాళికి కరుణ, ప్రేమ, ధాతృత్వం, త్యాగం కల్గివున్న దేవదేవుడు ఏసుక్రీస్తు అందించిన సందేశం అనుసరణీయమన్నారు. పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగనన్నకి ఏసుక్రీస్తు దీవెనలు నిండుగా వుండాలని ఆకాంక్షించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, ఫాస్టర్లకు క్రిస్మస్ కానుకలను అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ డయాసిస్, విజయవాడ ఏరియా ప్యారీస్ ఫాస్టర్ ఫెలోషిప్ ఫాస్టర్లు, 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బల్లం కిషోర్, కె.హరి, దాసం దుర్గారావు, కైకాల శరన్, యండీ రహీం, కుమారస్వామి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.